క్లుప్తంగా

మైనంపల్లి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మైనంపల్లి

మనోహరబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరబాద్‌కు చెందిన బాల్‌రెడ్డి కుటుంబీకులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. శనివారం కాళ్లకల్‌లోని ఓ పరిశ్రమ గోడ కూలిన ఘటనలో బాల్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న మైనంపల్లితో పాటు బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి, సర్పంచుల ఫోరం రాష్ట్ర నాయకులు మహిపాల్‌రెడ్డి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ



నవీన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

చిన్నశంకరంపేట(మెదక్): పాముకాటుకు గురైన నార్సింగి మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కందరి నవీన్‌ను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదివారం పరామర్శించారు. నవీన్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైలారం బాబు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం



దొంతిలో కూలిన చెట్టు

శివ్వంపేట(నర్సాపూర్): ఓ చెట్టు కూలిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. తూప్రాన్–నర్సాపూర్ రహదారి పక్కన మండల పరిధిలోని దొంతి బస్టాండ్ వద్ద శనివారం భారీ వృక్షం కూలింది. ఈ చెట్టు టిఫిన్ సెంటర్‌తో పాటు మరో దుకాణంపై పడింది. అయితే చెట్టు కూలిన సమయంలో టిఫిన్ సెంటర్ మూసి ఉండడంతో పాటు బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటనలో సంతోష్‌కు చెందిన టిఫిన్ సెంటర్, ఎల్లయ్య రేకుల దుకాణం ధ్వంసమయ్యాయి. మరోవైపు, చెట్టు కూలడంతో ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి కూలిన చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతల రోడ్లతో ఇబ్బందులు



రోడ్డుపై నిలిచిన నీరు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని కోంటూర్– వెంకటాపూర్ గ్రామం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో ప్రయాణిస్తున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనాదారులు కోరుతున్నారు.

నిండుకుండలా చెక్ డ్యాం



దామరంచ శివారులో అలుగు పారుతున్న చెక్ డ్యాం

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో రెండురోజుల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిస్తోంది. దీంతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, హల్దీ ప్రాజెక్ట్ కాల్వపై నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా నిండుకున్నాయి. దీంతో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. కాగా, నిండుకుండలా ఉన్న చెక్ డ్యాం ప్రాంతాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివెళ్తున్నారు. మరోవైపు పంటలు ఎండుముఖం పడుతున్న తరుణంలో వర్షాలు పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోటెత్తిన భక్తజనం

- కనులపండువగా బోనాల ఉత్సవాలు
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ దేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఇన్‌చార్జి ఈఓ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పంగారావు ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్, విగ్నేష్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం ఒడి బియ్యం పోసి, బోనాలు సమర్పించారు. ఈ మేరకు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి, వాహన పూజలు జరిపించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కొడిపల్లి: తునికి నల్లపోచమ్మ దేవికి పూజలు చేస్తున్న భక్తులు

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.



దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

ఘనంగా నల్లపోచమ్మకు బోనాలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో నల్లపోచమ్మకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, నర్సింలు, నాగులు, ఆగమయ్య, బాలేశ్, నరేష్, సంతు, యాదగిరి, మహిళలు పాల్గొన్నారు.



చేగుంటలో బోనాలతో మహిళలు

రాజరాజేశ్వరి దేవాలయంలో..

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో ఆదివారం శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మహాన్యాసంతో శత రుద్రాభిషేకం, శత ఘటాభిషేకంతో సహా లక్ష బిల్వార్చన, కుంకుమార్చన, కల్యాణోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. ఈ మేరకు పాడి, పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేడుకలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.



గర్భగుడిలో కొలువైన చాముండేశ్వరి అమ్మవారు

అనాలోచిత వ్యాఖ్యలు తగవు

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్

చిన్నశంకరంపేట(మెదక్): ఇష్టానుసారంగా నోరుపారేసుకుంటే చూస్తూ ఊరుకోబోమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.గోవర్ధన్ హెచ్చరించారు. మెదక్ కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జి మంత్రిపై అనాలోచితంగా మాట్లాడం.. దీన్ని ఖండించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డిపై కూడా అదేస్థాయిలో నోరుపారేసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే హోదాను గౌరవించి ఊరుకుంటున్నామని, లేకపోతే గ్రామాల్లో తిరగలేరని హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీ కమిషన చైర్మన్‌గా బక్కి వెంటకయ్యకు పార్టీలకు అతీతంగా అందిస్తున్న గౌరవన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రభాకర్, రుక్మోద్దీన్, సుధాకర్, బాచిస్వామి ఉన్నారు.



మాట్లాడుతున్న గోవర్ధన్, నాయకులు

కులమతాలకతీతంగా పీర్ల పండుగ



పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: పట్టణ పరిధిలోని 7వ వార్డు అల్లాపూర్‌లో పీర్ల పండుగను ఆదివారం కులమతాలకతీతంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్లకు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది మొహరం పండుగ అనంతరం పీర్ల పండుగను గ్రామంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే రాఖీ పండుగ, పీర్ల పండుగ ఒకేసారి రావడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

వధువు కుటుంబానికి పుస్తె, మెట్టెలు అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన ఊరడి మధు, దుర్గమ్మ కూతురు ప్రవళిక వివాహం ఈనెల 13న జరగనుంది. అయితే వధువు తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మానెపల్లి గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి తనవంతు సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. వధువు కుటుంబానికి ఆదివారం పుస్తెమెట్టెలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గౌడ్, శేఖర్, నర్సింలు, బాలమల్లయ్య, కృష్ణ, కిష్టయ్య, నెల్లూర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

నర్సాపూర్: విద్యార్థులకు ఎల్లప్పుడు నేర్చుకునే మనస్తత్వం ఉండాలని హైదరాబాద్‌కు చెందిన ఏటీఅండ్‌టీ కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంతం టాలెంట్ అక్విజిషన్ విభాగం రీజనల్ లీడర్ పద్మజా శ్రీరాం చెప్పారు. ఆదివారం స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలేజీలో మంచి వసతులున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రపంచాన్ని అన్వేషించాలని, తమ కోసం కలలు కనాలని సూచించారు. కాలేజీల్లో నేర్చుకున్న ప్రతీ విషయాన్ని ఆచరణలో పెట్టాలని ఆమె హితవు పలికారు. అలాగే శ్రీవిష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సా మాట్లాడుతూ.. తమ సొసైటీ చైర్మన్ విష్ణురాజు దూరదృష్టితో కూడిన ఆలోచన ధోరణితో విద్యార్థులకు మరింత అత్యుత్తమ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పద్మవిభూషణ్ డాక్టర్ బీవీ రాజు మెమోరియల్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, మేనేజర్ బాపిరాజు, ఏఈ సురేష్, హెచ్ఓడీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన గొలుపుల మహేష్ ఇటీవల పోతంశెట్టిపల్లి వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ మేకు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, రామిరెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వానలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుఝాము వరకు 90.మి.మిల వర్షపాతం నమోదైంది. ఇలాగే వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. ఈ వర్షం ఆరుతడి పంటలతో పాటు వరి పంటకు ఎంతో మేలు చేకూర్చింది.

నేటి నుంచి నులిపురుగు నివారణ మందుల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో నులిపురుగు నివారణకు మందు బిల్లలు అందించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ సాయిసింధు తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయస్సున్న పిల్లలకు వైద్య సిబ్బంది అల్బండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో తరచూ కడుపునొప్పి, అలిసిపోవడం, చదువుపైనా దృష్టి పెట్టకపోవడం సమస్యలకు కారణమైన నులిపురుగు నివారణకు మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిటుక్కుల్ సబ్‌స్టేషన్ పరిధిలోని చండూర్, గౌతాపూర్, బద్రియాతండాలలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈఈ సల్మాన్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని సూచించారు.విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా మోడువారిన చెట్టు

తూప్రాన్: తూప్రాన్–గజ్వేల్ రహదారిపై యావపూర్ ఆర్టీసీ బస్టాప్ వద్ద ఓ చెట్టు మోడువారింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన బాధితులను కాంగ్రెస్ నాయకులు మర్చిపోయారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని 6, 7, 8, 9 వార్డులలో , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పట్టణ శాఖ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు సత్యంగౌడ్, బాల్‌రెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ మేరకు బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నమస్తే నర్సాపూర్ పేరిట పట్టణంలో పర్యటించి ఏమి సాధించారని, ప్రస్తుతం వర్షాలతో నష్టపోయిన బాధితులు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. పట్టణానికి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 40 కోట్ల నిధులు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా నిధులు విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. పట్టణంలో పలు ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ప్రచారం కోసం మాత్రమే కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీలో పర్యటించారని ఎద్దేవా చేశారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మిషన్ భగీరథ నీరు ఇలా.. తాగేదెలా..!

- తాగునీరు సరఫరాలో బురద నీరు
- ఆందోళనలో ఇబ్రహీంబాద్ గ్రామస్తులు



తాగునీటిలో బురద

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఇబ్రహీంబాద్‌లో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు బురదమయంగా సరఫరా జరుగుతోంది. అలాగే గ్రామంలో ఉన్న మంచినీటి బోరు మోటర్ చెడిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమై అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బోరు మోటర్‌కు మరమ్మతులతో పాటు మిషన్ భగీరథ తాగునీరు సరఫరాలో మంచినీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తాగునీటి కోసం నిరీక్షిస్తున్న మహిళలు

ఈత చెట్ల పెంపకానికి భూములివ్వాలి

జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్నగౌడ్

కల్హేర్(నారాయణఖేడ్): ఈత, తాటి చెట్ల పెంపకానికి ప్రతి కల్లుగీత సొసైటీలకు ఐదు ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్హేర్ మండలం మార్డిలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్యయాత్ర సభ నిర్వహించారు. గౌడ సంఘలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాటి సంరక్షణ కోసం డ్రిప్పు, బోరు మంజూరు చేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభించాలని, హైదరాబాద్‌లో నీరా కేఫ్‌ను టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఈ నెల 18న సంగారెడ్డిలో యాత్ర ముగింపు సభ జరగనుందని చెప్పారు. గౌడ, కల్లుగీత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అంజగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేశంగౌడ్, కుమార్ గౌడ్. సంఘం నాయకులు నరసింహగౌడ్, భూమాగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఈ నెల 13 వరకు రైతు బీమా కోసం నూతన పట్టాదారులు దరఖాస్తులను అందించాలని వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ కోరారు. జూన్ 5 వరకు పట్టాపాస్ బుక్కు వచ్చిన రైతులు తమ ఆధార్‌కార్డుతో పాటు నామిని ఆధార్‌కార్డుతో పట్టాపాస్ పుస్తకం జిరాక్స్‌తో దరఖాస్తులు అందించాలని సూచించారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న రైతులు నేరుగా దరఖాస్తులను రైతు వేదికలో ఏఈఓలకు అందించాలని కోరారు.

నర్సాపూర్: అర్హులు రైతు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ఈ నెల 13లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు.

కొడిపల్లిలో..

కొడిపల్లి(నర్సాపూర్): అర్హులైన రైతులు రైతు బీమా చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వప్న అన్నారు. ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు.

నామిని పేరు మార్పు..

కొల్చారం(నర్సాపూర్): రైతు బీమా పథకంలో నామిని పేరు మార్చేందుకు ఈ నెల 12 చివరి తేదీ అని మండల వ్యవసాయ అధికారి శ్వేత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఎవరైనా ఈ పథకంలో నామిని పేరు మార్చడం, నామిని చనిపోయిన కొత్త పేరుకు అవకాశం ఉందన్నారు.

సిద్ధియోగి కృష్ణనందాజీకి ఘనస్వాగతం



కృష్ణ నందాజీకి స్వాగతం పలుకుతున్న కబీర్ సేన కమిటీ సభ్యులు

నర్సాపూర్ రూరల్: హిమాలయాల ప్రాంతానికి చెందిన సిద్ధియోగి కృష్ణనందాజీ మహారాజుకు ఆదివారం పట్టణంలో కబీర్ సేన కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ కబీర్ సేన ప్రెసిడెంట్ చత్రు నాయక్, చిప్పల్‌తుర్తి మాజీ ఎంపీటీసీ సంధ్యారాణి మాట్లాడుతూ.. మండలంలోని చిప్పల్ తుర్తిలోని సద్గురు దామ్ ఆశ్రమంలో ఈ నెల 15, 16, 17వ తేదీలలో హావన్ పూజ బ్రహ్మదీక్ష శ్రీరామ్ కథ సద్గురు అమృతవాణి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. కావున పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కబీర్ సేన కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గుప్తా కోరారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

తూప్రాన్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు శాపంగా మారింది. పట్టణంలోని 16వ వార్డు సినిమా థియేటర్ కాలనీలోని ప్రధాన రహదారిపై గత రెండు నెలల క్రితం మురుగు కాల్వ కుంగిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వ్యాపార సంస్థల్లోకి నీరు చేరడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో మున్సిపల్ సిబ్బంది మురుగు కాల్వను తవ్వి మట్టిని రోడ్డుపై పోసి గుంతను వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే పలుమార్లు వ్యాపారులు మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వను నిర్మించి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



16వ వార్డులో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రిన్సిపాల్ శ్రీనివాస్



పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇచ్చి జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కల్పించడంతో కళాశాలకు అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో డిజిటల్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, అంకితభావం కలిగిన బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయి. యూనివర్సిటీ పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలు సాధించారని తెలిపారు. ఏడాది కళాశాలలో ఇప్పటికే బీకాంలో 261, బీబీఏలో 51, బీఏలో 87, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో 86, ఫిజికల్ సైన్స్‌లో లో 87 ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకున్నారు. అలాగే, లాస్ట్ ఫేజ్‌లో అడ్మిషన్లు పొంది 70 మంది జాయిన్ కావడానికి సిద్ధంగా ఉన్నారని, మొత్తం కళాశాల అడ్మిషన్లు 650 నుంచి 700కు చేరుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ఫైలేరియాపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): ఫైలేరియా నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బోధకాల వ్యాధి నిర్మూలనలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ దోమడుగులో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గుమ్మడిదల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గ్రామాల్లో ఈ నెల 10 నుంచి 25 వరకు రెండు సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే అందజేయనున్నట్లు మండల వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలను వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సైదులు, వీరేశం, హెచ్ఈఓ శ్రీనివాస్, వైద్యబృందం భాగ్యలక్ష్మి,పాల్గొన్నారు.